ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 16 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 9 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

FRIDAY OCTOBER 16 2026 | VOL:1 | ISSUE: 9 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

వంతెన కోసం 13 ఆదివాసీ గ్రామాల ఎదురుచూపులు!

మొవాడ్ ప్రాంతంలో 2,000 మందికి తప్పని రవాణా కష్టాలు.. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజల విజ్ఞప్తి

3

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (మిగతా 2వ పేజీలో..)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే

నీటి సంక్షోభం: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదన్న సీఎం
- యాసంగిలో వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి
- గతేడాదితో పోలిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి పడిపోయినట్లు వెల్లడి
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని కోరిన సీఎం రేవంత్



తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రం కఠినమైన నీటి, విద్యుత్ కొరతను ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు అంచనా వేసినట్లుగానే పరిస్థితులు చేయిదాటిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ప్రజల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుందని, ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎల్ నినో పరిస్థితులపై మంత్రులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని జలాశయాల్లో 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి కేవలం 209 టీఎంసీలకు పరిమితమయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న ఈ స్వల్ప జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, తాగునీటి అవసరాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.వచ్చే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతాంగం పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యాసంగి సీజన్‌లో వరి సాగును పక్కనపెట్టి, తక్కువ నీటి వినియోగంతో పండే ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు.

(మిగతా 2వ పేజీలో..)

ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం

(మిగతా 2వ పేజీలో..)





సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన.. శ్రీధర్‌బాబు ఏమన్నారంటే?

- సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను (మిగతా 2వ పేజీలో..)

'మనం చేసి చూపిద్దాం'... ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం



భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, (మిగతా 2వ పేజీలో..)



సీఈసీని రక్షించేందుకే ఇదంతా: అభిజిత్ దీప్కే

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు

నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ (మిగతా 2వ పేజీలో..)



(మిగతా 2వ పేజీలో..)

కవిత ఫైర్.. కాంగ్రెస్ పాలనపై తీవ్ర ఆరోపణలు!

- కమిషన్ల కోసమే పనులు కట్టబెడుతున్నారని విమర్శ
- సీఎం కార్యాలయంపై కవిత ప్రశ్నలు
- బెదిరింపులకు పాల్పడితే వదిలిపెట్టబోమని హెచ్చరిక
- మహిళా రైతులకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని డిమాండ్
- ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత అందించాలని విజ్ఞప్తి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు

మరో 10 నెలల్లో మోదీ సర్కార్ పతనం!

- కార్యకర్తలు భయపడొద్దు.. అండగా నేనున్నా
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువతలిలి
- బీజేపీలో చేరిన నేతలపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

నూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో పది నెలల్లో కూలిపోతుందని(మిగతా 2వ పేజీలో..)





రేవంత్.. ప్రజలే నీ ఉద్యోగం ఊడగొడ్తరు

- 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

అధికారుల ఉద్యోగాలు ఊడగొడ్తానని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ముమ్మందు ప్రజలు, ఉద్యోగులే బుద్ధి చెప్తారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. అధికారుల కంటే ముందే ప్రజలే ముఖ్యమంత్రి ఉద్యోగాన్ని ఊడగొట్టే రోజులు దగ్గరపడ్డాయని, జాగ్రత్తగా చూసుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.విద్యుత్ సంక్షోభానికి కాంగ్రెస్ సర్కార్ చేతగానితనమే కారణమని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు అధికారులపై నెపం నెట్టడం సీఎం, మంత్రులకు పరిపాటిగా మారిందని గురువారం 'ఎక్స్'లో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. ముందుచూపుతో కనీస బొగ్గు నిల్వలు కూడా సమకూర్చుకోకుండా విద్యుత్ సంక్షోభానికి కారణమైందే కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. శాఖాపరమైన సమీక్షలు నిర్వహించకుండా విద్యుత్ రంగాన్ని గాలికి వదిలేయడం వల్లే ఇవాళ రాష్ట్రమంతటా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. సొంత తప్పులను ఇతరులపైకి నెట్టేసి పాలకులు సుద్దపూసల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

గతంలోనూ ఇదే తంతు

గతంలో నిషేధిత భూముల జాబితా విషయంలో తప్పులు చేసి అధికారులపైకి నెట్టిన రేవంత్ (మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన.. శ్రీధర్‌బాబు ఏమన్నారంటే?

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది.దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది.మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు.ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

కవిత ఫైర్.. కాంగ్రెస్ పాలనపై తీవ్ర ఆరోపణలు!

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలన ప్రజా సంక్షేమానికి బదులుగా దోపిడీకి వేదికగా మారిందని ఆరోపించారు. అనుచరులు, సన్నిహితులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు.

కమిషన్ల కోసమే పనులా?

అర్హతలు లేని వ్యక్తులకు కమిషన్ల కోసం పనులు అప్పగిస్తున్నారని కవిత ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలోనే ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కమిషన్ల కోసం బెదిరింపులకు పాల్పడే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

మహిళా రైతులకు చట్టబద్ధ గుర్తింపు

తెలంగాణలో మహిళా రైతుల సాధికారత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులు, వ్యవసాయ కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని కోరారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలతో పాటు సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రేవంత్.. ప్రజలే నీ ఉద్యోగం ఊడగొడ్తరు

(మొదటి పేజీ తరువాయి)

సరార్.. ఇప్పుడు కరెంట్ కోతల విషయంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా పరిస్థితి విషమించాక నిద్రలేచి, అధికారులను సస్పెండ్ చేస్తామంటూ ప్రభుత్వం బెదిరింపులకు దిగుతున్నదని మండిపడ్డారు. తమ పాలనా వైఫల్యాలను అధికారుల ఖాతాలో వేసి చేతులు దులుపుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. ఎల్ నినోను కొవిడ్ లాంటి ప్రకృతి విపత్తుతో పోల్చుతున్న పాలకులు.. వాటన్నింటికంటే రేవంత్‌రెడ్డి పాలనే రాష్ట్రానికి అతిపెద్ద విపత్తుగా మారిందనే నిజాన్ని ఎందుకు గుర్తించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఎల్ నినో ఎఫెక్ట్‌తో శాస్త్రవేత్తలు చెప్పినట్లుగానే నీటి సంక్షోభం: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రైతులు ఈ త్యాగానికి సిద్ధపడాలని, ఒక సీజన్ పాటు వరి సాగును వాయిదా వేసుకోవాలని విన్నవించారు.మరోవైపు, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సగటు డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల భారం పడుతోందని, అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ వాడకం జరగడం గతంలో ఎన్నడూ లేదని వివరించారు. మార్కెట్‌లో ఎంత వ్యయానికైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

(సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

'మనం చేసి చూపిద్దాం'... ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

చారిత్రక విజయాలపై ప్రశంసలు

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు.భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడారంగానికి ప్రభుత్వ అండ

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

సీఈసీని రక్షించేందుకే ఇదంతా: అభిజిత్ దీప్కే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం ఆరోపించారు.ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా భోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు.ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

సీజేపీ నేతల అరెస్ట్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

మరో 10 నెలల్లో మోదీ సర్కార్ పతనం!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ యువత కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎలాంటి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదని, వారికి అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు.రాహుల్ గాంధీ నిరసనల అనంతరం గురువారం ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో టీ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి పరిణామాలు ఎదురైనా తాను అండగా నిలుస్తానని తెలిపారు.కేంద్ర ప్రభుత్వంపై యువతలో వ్యతిరేకత పెరుగుతోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన నాయకులు ప్రస్తుత పరిణామాలను చూసి బాధపడుతున్నారని పేర్కొంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాబోయే రోజుల్లో రాజకీయ పరిస్థితులు మారుతాయని ధీమా వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, మోదీ ప్రభుత్వం పది నెలల్లో కూలిపోతుందన్నది ఆయన రాజకీయ అంచనా మాత్రమే.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

“మా గ్రామాలకు వంతెన ఎప్పుడు నిర్మిస్తారు?” --- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మొవాడ్ ప్రాంత ఆదివాసీలు

- **వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. అభివృద్ధి పథకాలు అమలవుతున్నా.. మారుమూల ఆదివాసీ గ్రామాలకు మాత్రం కనీస రవాణా సౌకర్యం అందని పరిస్థితి నెలకొంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండల పరిధిలోని మొవాడ్ ప్రాంతంలో వంతెన సౌకర్యం లేక 13 గ్రామాలకు చెందిన సుమారు 2,000 మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతానికి వంతెన నిర్మించి రాకపోకల కష్టాలను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

13 గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు

మొవాడ్ ప్రాంతంలోని లీమ్ గూడ, గోగీన్ మొవాడ్, టెంర్యాన్ మొవాడ్, సుద్దా ఘాట్, వాడి గొంది, చేల్క గూడ, తడవగూడ, చౌపన్ గూడ, సంతోష్ గూడ, నాగలగొంది, సముతులగుండం, బండ్లగూడ, టోక్కిగూడ గ్రామాల ప్రజలకు వంతెన సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని స్థానికులు చెబుతున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నిత్యావసర పనుల కోసం ప్రయాణించేటప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

అత్యవసర సమయంలో అండగా నిలిచేదెవరు?

విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం నుంచి అనారోగ్యంతో బాధపడేవారిని ఆసుపత్రులకు తరలించడం వరకు రవాణా సౌకర్యం ఎంతో కీలకం. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడితే అత్యవసర వైద్య సేవలు పొందడంలో జాప్యం జరిగే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సురక్షితమైన రవాణా మార్గం అందుబాటులోకి రావాలంటే వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అభివృద్ధి ఫలాలు ఆదివాసీ గూడేలకు చేరేదెప్పుడు?

దేశం మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ముందుకు సాగుతున్నప్పటికీ మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లో వంతెన వంటి సౌకర్యాల కొరత కొనసాగడం స్థానికుల ఆవేదనకు కారణమవుతోంది. వంతెన నిర్మాణం పూర్తయితే గ్రామాల మధ్య రాకపోకలు మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు ప్రయాణం సులభమవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అధికారులు స్పందించి వంతెన నిర్మించాలి

మొవాడ్ ప్రాంతంలోని 13 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సర్వే నిర్వహించి, అంచనాలు రూపొందించి, నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మొవాడ్ ప్రాంతానికి చెందిన లిముగూడ పటేల్ మడావి జంగు సహా స్థానికులు తమ ప్రాంత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వంతెన నిర్మాణం కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదని, ప్రజల భద్రత, విద్య, వైద్యం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్న అంశమని పేర్కొంటున్నారు. మా గ్రామాలకు వంతెన నిర్మించి మా కష్టాలను తీర్చండి అంటూ మొవాడ్ ప్రాంత ఆదివాసీ గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి వంతెన నిర్మాణానికి కార్యాచరణ ప్రకటించాలని కోరుతున్నారు.





మాడావి జంగు మోవాడ ప్రాంతం -- ముగూడ పటేల్

ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు పోలీసుల ప్రత్యేక చర్యలు

- **సూర్యాపేట జిల్లాలో 45 బ్లాక్ స్పాట్ల గుర్తింపు.. ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు**
- **అతివేగం వద్దు.. నిర్లక్ష్యం అసలే వద్దు! సురక్షిత ప్రయాణమే లక్ష్యం: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ**

సూర్యాపేట, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



రహదారులపై ప్రమాదాల ముప్పును తగ్గించి, ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ప్రమాదాలు జరిగే అవకాశమున్న 45 బ్లాక్ స్పాట్లను గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రమాదకర ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ ఈ బోర్డులను ప్రారంభించారు.

45 బ్లాక్ స్పాట్లు.. ప్రతి ప్రాంతంలో రెండు బోర్డులు

జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలకు ఆస్కారమున్న 45 ప్రాంతాలను గుర్తించినట్లు ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ప్రతి బ్లాక్ స్పాట్‌కు ఇరువైపులా 100 మీటర్ల పరిధిలో వాహనదారులను అప్రమత్తం చేసేలా రెండు చొప్పున హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రివేళల్లోనూ బోర్డులు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లను వినియోగించారు. ప్రమాదకర ప్రాంతానికి చేరుకునే ముందే వాహనదారులు అప్రమత్తమై వేగాన్ని తగ్గించేలా ఈ బోర్డులు దోహదపడతాయని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులను ముందుగానే అప్రమత్తం చేయవచ్చన్నారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిర్ణీత వేగ పరిమితిని మించకుండా వాహనాలు నడపాలని సూచించారు. గమ్యస్థానానికి త్వరగా చేరుకోవడం కంటే సురక్షితంగా చేరుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు.



పండుగ వేళల్లో మరింత అప్రమత్తత అవసరం

దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగల సమయంలో రహదారులపై వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రయాణికులు మరింత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. హెచ్చరిక బోర్డులను గమనిస్తూ ప్రమాదకర ప్రాంతాల్లో నెమ్మదిగా ప్రయాణించాలని, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను పాటించాలని కోరారు. డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం, అతివేగం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

అత్యవసర సహాయం కోసం 112కు కాల్ చేయండి

రోడ్డు ప్రమాదం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సహాయం పొందేందుకు 112 నంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాద ప్రాంతాల్లో తక్షణ సహాయం కోసం సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను కూడా హెచ్చరిక బోర్డులపై పొందుపరిచినట్లు తెలిపారు.

ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలి

“అరైవ్ అలైవ్” --- అంటే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడం --- అనే లక్ష్యంతో ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ కె. నరసింహ విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా వాహనాలు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు గుడ్‌న్యూస్!

ప్రజావాణి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు.. నెల రోజుల గడువు

హనుమకొండ, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా సీఎం ప్రజావాణి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ప్రత్యేక మాడ్యూల్ అందుబాటులోకి వచ్చిన వెంటనే నెల రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

మీసేవ, ప్రజావాణి కేంద్రాల ద్వారా దరఖాస్తులు

ఉద్యమకారులు తమ దరఖాస్తులను సమీప మీసేవ కేంద్రాలు, ప్రజావాణి కేంద్రాల ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్లు నిరూపించే ఆధారాలు, ఉద్యమ కాలంలో నమోదైన కేసుల వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది.

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం తుది జాబితా

దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించి, అర్హులైన ఉద్యమకారులను గుర్తించనున్నారు. అనంతరం అర్హుల తుది జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. గుర్తింపు పొందిన ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.



వంగర నూతన ఎస్సైగా ఎం. రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా

భీమదేవరపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఎం. రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్సై రాజు మాట్లాడుతూ.. ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని, సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించాలని కోరారు.ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వంగర ఎస్సైగా పనిచేస్తున్న దివ్య హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, ఆమె స్థానంలో ఎం. రాజు బాధ్యతలు స్వీకరించారు.

తూర్పుకోటలో బతుకమ్మ వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

- **ఆడపడుచులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, లైటింగ్, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలి.. అఖిలపక్ష నాయకుల డిమాండ్**

ఖిలా వరంగల్, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో, సురక్షిత వాతావరణంలో జరుపుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఖిలా వరంగల్‌లోని తూర్పుకోటలో బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని, నిమజ్జన ప్రాంతాన్ని వారు పరిశీలించి పండుగ ఏర్పాట్లపై దృష్టి సారించారు.ఈ సందర్భంగా బతుకమ్మ ఆడే ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, తగినంత వెలుతురు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అలాగే నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి, పండుగకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అఖిలపక్ష నాయకులు సూచించారు. బతుకమ్మ ఆట స్థలం నుంచి నిమజ్జన ప్రాంతం వరకు పరిశుభ్రత, తాగునీరు, లైటింగ్ తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కోరారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టి పండుగను విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు.

వేలేరు ఎస్‌హెచ్‌ఓగా దుదిమెట్ల నరేష్ బాధ్యతల స్వీకరణ

- **నూతన ఎస్ఐకి కాంగ్రెస్ నాయకుల మర్యాదపూర్వక అభినందనలు..**

శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్ష

వేలేరు, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా వేలేరు మండల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ దుదిమెట్ల నరేష్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి సంపత్ మాట్లాడుతూ.. వేలేరు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు నూతన ఎస్ఐ సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో వేలేరు మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అత్తేన రాజేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు తూముల ప్రశాంత్, జుర్రు శ్రావణ్, జుర్రు హరీష్, ఎస్‌కే పాషా, రాజు, అఖిల్‌తో పాటు సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో శాస్త్రీయ పరిశోధనకు కొత్త ముందడుగు

- **టమాటా పంట అభివృద్ధిపై డాక్టర్ జి. విక్రమ్ పరిశోధనా గ్రంథం ఆవిష్కరణ**
- **ట్రాన్స్‌జీన్ సాంకేతికతతో పంటల అభివృద్ధిపై డాక్టర్ జి. విక్రమ్ రచన**

కాకతీయ విశ్వవిద్యాలయం, (ప్రజానేస్తం జ్వాల):



వ్యవసాయ రంగంలో ఆధునిక జీవసాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా కాకతీయ విశ్వవిద్యాలయంలో కీలక కార్యక్రమం జరిగింది. టమాటా పంట అభివృద్ధిలో ట్రాన్స్‌జీన్ సాంకేతికత వినియోగాన్ని వివరించే ‘Transgene Technology for Improvement of Cultivated Tomato అనే పరిశోధనా గ్రంథాన్ని డాక్టర్ జి. విక్రమ్ రచించారు. ఈ పుస్తకాన్ని విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరిపాలనా అధికారులు పాల్గొన్నారు.టమాటా సాగులో పంట అభివృద్ధికి ట్రాన్స్‌జీన్ సాంకేతికత ఎలా దోహదపడగలదనే అంశాలను ప్రధానంగా వివరిస్తూ ఈ గ్రంథాన్ని రూపొందించారు. వ్యవసాయ శాస్త్రం, మొక్కల జన్యు సాంకేతికత, జీవసాంకేతిక పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ఈ పుస్తకం ఉపయోగకరంగా నిలవనుంది.ఈ సందర్భంగా రచయిత డాక్టర్ జి. విక్రమ్ తన విద్యా, పరిశోధనా ప్రయాణంలో మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించిన గురువు ప్రొఫెసర్ ఎన్. రామస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పుస్తక రచనలో సహకరించిన సహరచయిత డాక్టర్ రజనీకాంత్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే, తన పరిశోధనాత్మక కృషికి ప్రోత్సాహం అందించిన వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, స్టాఫ్ సెక్రటరీ, వివిధ విభాగాల అధిపతులకు కృతజ్ఞతలు తెలిపారు. సహచర అధ్యాపకులు, మిత్రులు, విద్యార్థులు అందించిన ప్రోత్సాహం తన విజయానికి తోడ్పడిందని పేర్కొన్నారు.శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తరించడంతోపాటు వ్యవసాయ రంగంలో ఆధునిక పరిశోధనల ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా డాక్టర్ జి. విక్రమ్ రచించిన ఈ గ్రంథం విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

108 సేవలతో 756 మంది ప్రాణాలు కాపాడాం

భీమదేవరపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా 108 మేనేజర్ మండ శ్రీనివాస్ సూచించారు. గురువారం భీమదేవరపల్లి మండలంలోని 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది 756 మంది ప్రాణాలను కాపాడిన సిబ్బందిని అభినందించారు.విషపురుగుల కాటు, సీజనల్ వ్యాధులు, గర్భిణులకు అత్యవసర వైద్యం, విద్యుత్, రోడ్డు ప్రమాదాల సమయంలో వెంటనే 108కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునీర్, 108 ఈఎంటీలు విద్యాసాగర్, రవి, తేజస్విని, పైలెట్లు కృష్ణంరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం అందించాలి

చట్టం అమలులో నిర్లక్ష్యం వహించొద్దు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బాధితులకు అందాల్సిన పరిహారం, పునరావాసం, ప్రభుత్వ పథకాల అనుసంధానం, ప్రత్యేక కోర్టుల్లో పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు న్యాయం జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ కె. నరసింహ పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, కోర్టు విచారణకు సంబంధించిన వివరాలను కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సంక్షేమ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరంగల్ NITలో 34 ఫ్యాకల్టీ పోస్టులు.. నవంబర్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ

- **మెకానికల్ ఇంజినీరింగ్ సహా పలు విభాగాల్లో కొలువులు.. అర్హులైన అభ్యర్థులకు అవకాశం**

హనుమకొండ, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



ఉన్నత విద్యారంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. వరంగల్‌లోని ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT Warangal)లో 34 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.అర్హత కలిగిన అభ్యర్థులు 2026 నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పలు స్పెషలైజేషన్లలో అవకాశాలు

ఈ నియామకాల్లో భాగంగా సంస్థలోని వివిధ విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు. ముఖ్యంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, మ్యానుఫ్యాక్చరింగ్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజేషన్లకు సంబంధించిన పోస్టులు ఉన్నాయి. సంబంధిత విద్యార్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

పోస్టుల వారీగా విద్యార్హతలు, అవసరమైన అనుభవం, వేతన వివరాలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలను అభ్యర్థులు NIT వరంగల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలి. దరఖాస్తు చివరి తేదీ: 30 నవంబర్ 2026 అధికారిక వెబ్‌సైట్: https://nitw.ac.in/faculty ఉన్నత విద్యాసంస్థలో ఫ్యాకల్టీగా పనిచేయాలనే లక్ష్యంతో ఉన్న అర్హులైన అభ్యర్థులు నోటిఫికేషన్‌ను పూర్తిగా పరిశీలించి, గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.

హాఫ్ మారథాన్.. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- **ఈ నెల 17న ఉదయం 4 నుంచి 10 గంటల వరకు అమలు.. పలు మార్గాల్లో వాహనాల మళ్లింపు**

హనుమకొండ, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



నగరంలో ఈ నెల 17న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ రన్ నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.మారథాన్ నిర్వహణ నేపథ్యంలో పలు ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలను దారి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను వడ్డేపల్లి చర్చి--కేయూసీ మార్గం మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు.అలాగే సీఎస్‌ఆర్ గార్డెన్--అదాలత్, అంబేద్కర్--కాలేజీ జంక్షన్, ఫాతిమా--ఎన్‌ఐటీ మార్గాల్లో సాధారణ వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. 100 ఫీట్ల రోడ్డుపై ఒకవైపు మాత్రమే వాహనాలను అనుమతించనున్నట్లు వివరించారు.ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని సీపీ సూచించారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

వరంగల్‌లోనే నిమ్స్ స్థాయి వైద్యం.. ఉత్తర తెలంగాణకు కొత్త భరోసా

- **నేటి నుంచే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం**
- **నవంబర్--డిసెంబర్ నాటికి మిగతా పనులు పూర్తి చేసే లక్ష్యం.. డిసెంబర్ 15 తర్వాత ఆసుపత్రిని సందర్శించనున్న సీఎం రేవంత్ రెడ్డి: మంత్రి పొంగులేటి**

హనుమకొండ, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



ఉత్తర తెలంగాణ వైద్య రంగంలో కీలక మార్పునకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వేదిక కానుంది. హైదరాబాద్‌లోని నిమ్స్ తరహాలో అత్యాధునిక వైద్య సేవలను వరంగల్‌లోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నూతన ఆసుపత్రి భవనంలో గురువారం నుంచి ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. మిగిలిన నిర్మాణ పనులను నవంబర్ లేదా డిసెంబర్ నాటికి పూర్తి చేసి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి తెలిపారు. గతంలో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతం చేసి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు వివరించారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ పేదలకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌కు వెళ్లే అవసరం తగ్గేనా?

ఉత్తర తెలంగాణలోని వరంగల్, హనుమకొండతో పాటు పరిసర జిల్లాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌పై ఆధారపడాల్సిన అవసరం తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన రోగులకు ప్రయాణ సమయం, ఖర్చు తగ్గించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషించగలదని భావిస్తున్నారు. అయితే వివిధ వైద్య విభాగాలు, అత్యవసర చికిత్సలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం సేవల విస్తరణపై ఆధారపడి ఉంటుంది.

డిసెంబర్ 15 తర్వాత సీఎం సందర్శన

ఆసుపత్రిలో మిగిలిన నిర్మాణ పనులను నవంబర్ లేదా డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. డిసెంబర్ 15 తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆసుపత్రిని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించనున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనుల పురోగతి, వైద్య విభాగాల ఏర్పాట్లు, ప్రజలకు అందించే సేవలపై ఈ సందర్శనలో సమీక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఉత్తర తెలంగాణకు వైద్య సేవల విస్తరణపై ఆశలు

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ వైద్య రంగానికి మరింత బలం చేకూరే అవకాశం ఉంది. ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, అవసరమైన సిబ్బంది, సమర్థవంతమైన అత్యవసర సేవలు అందుబాటులో ఉండటం ఆసుపత్రి విజయానికి కీలకం కానుంది. ఓపీ సేవల ప్రారంభంతో మొదలయ్యే ఈ ప్రక్రియ పూర్తిస్థాయి వైద్య సేవలుగా విస్తరించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

గుండె వైద్యంలో మెడికవర్ అరుదైన ఘనత

- **వరంగల్‌లో తొలిసారిగా ఆర్బిటల్ అథెరెక్టమీ విజయవంతం.. సంక్లిష్ట కరోనరీ యాంజియోప్లాస్టీ పూర్తి**

హనుమకొండ, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ ట్రైసిటీలో అధునాతన గుండె వైద్య సేవల్లో మరో ముందడుగు పడింది. వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం అత్యంత సంక్లిష్టమైన గుండె రక్తనాళాల సమస్యకు ఆధునిక ఆర్బిటల్ అథెరెక్టమీ చికిత్సా విధానాన్ని విజయవంతంగా ఉపయోగించి కరోనరీ యాంజియోప్లాస్టీని పూర్తి చేసినట్లు వెల్లడించింది.గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో కాల్షియం తీవ్రంగా పేరుకుపోవడంతో ఏర్పడిన అడ్డంకులను తొలగించడం వైద్యులకు సవాలుగా మారుతుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆర్బిటల్ అథెరెక్టమీ సాంకేతికత ద్వారా గట్టిపడిన కాల్షియం పొరలను తగ్గించి, తదుపరి చికిత్సకు రక్తనాళాన్ని సిద్ధం చేయవచ్చు.ఈ ఆధునిక చికిత్స విజయవంతం కావడంతో వరంగల్ పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక గుండె వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చే అవకాశాలు మరింత మెరుగుపడ్డాయి. సంక్లిష్ట గుండె సంబంధిత సమస్యలకు అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే, చికిత్స పొందిన రోగి వివరాలు, వైద్య బృందం సభ్యుల పేర్లు, చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను ఆసుపత్రి అధికారికంగా వెల్లడిస్తే ఈ విజయంపై మరింత సమగ్ర సమాచారం అందుబాటులోకి రానుంది.

నేరేడుచర్ల మార్కెట్ కమిటీ పీఠాలు రంగినేని స్పందన రాజీవ్‌కు

- **కాంగ్రెస్ శ్రేణుల కోలాహలం మధ్య నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం**
- **వైస్ చైర్మన్‌గా మునగాల భాస్కర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ.. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**

నేరేడుచర్ల, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. నేరేడుచర్ల, పాలకవీడు మండలాల పరిధిలోని రైతులకు సంబంధించిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రంగినేని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్‌గా మునగాల భాస్కర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణుల సందడి, నాయకులు, కార్యకర్తల హాజరుతో ఉత్సాహభరితంగా సాగింది.చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు 17 మంది సభ్యులతో కూడిన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకట్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రెండు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మార్కెట్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది.

ఘన సన్మానం.. కార్యకర్తల్లో ఉత్సాహం

ప్రమాణ స్వీకారం అనంతరం నూతన చైర్‌పర్సన్ రంగినేని స్పందన రాజీవ్‌ను నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు అందించి సత్కరించారు. రాజీవ్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించి గజమాలతో ఘనంగా అభినందించారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధిపై ఆశలు

నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల రైతుల్లో మార్కెట్ కమిటీ సేవలపై ఆశలు నెలకొన్నాయి. రైతులకు మార్కెట్ యార్డులో మెరుగైన సౌకర్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల్లో అనుకూల వాతావరణం, రైతుల సమస్యల పరిష్కారానికి పాలకవర్గం ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు ఆశిస్తున్నారు.

ఉపాధి పనులపై జెడ్పీ సీఈఓ తనిఖీ.. కూలీల సంఖ్య పెంచాలని ఆదేశం

- **వంగర, ముల్కనూర్, ఎర్రబెల్లి గ్రామాల్లో పనుల పురోగతి పరిశీలన**

భీమదేవరపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న వీబీజీ రాంజీ పథకం పనులను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జెడ్పీ సీఈఓ) శేషాద్రి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంగర, ముల్కనూర్, ఎర్రబెల్లి గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల పురోగతిని తనిఖీ చేసి, పనుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ కూలీలకు మరింత ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, అర్హులైన కూలీలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పథకం లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పర్యటనలో ఎంపీడీవో వీరేశంతో పాటు మండల ఉపాధి హామీ పథకం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కర్కాయలగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూకల అజిత్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

- **నూతన కమిటీకి కీసర సంతోష్‌రెడ్డి శుభాకాంక్షలు.. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు**

మోతె, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా మోతె మండలం కర్కాయలగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూకల అజిత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంబాల వీరస్వామి ఎన్నికయ్యారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా కోరుట్ల లక్ష్మీనారాయణ, కొండూరి వెంకన్న, కార్యదర్శులుగా యాతకుల నర్సయ్య, బయ్య సైదులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా షేక్ రహీం ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కీసర సంతోష్‌రెడ్డి నూకల అజిత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మోతె మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య గౌడ్, మామిడి వెంకటేశ్వర్లు గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండూరి సత్యం, గ్రామ నాయకుడు కటకం శ్రీను, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ రైతులకు అవగాహన సదస్సు

శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చు: ఏరిస్ ఆగ్రో రీజినల్ మేనేజర్ రాజారెడ్డి

భీమదేవరపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



ఆయిల్‌ఫామ్ సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ, పంటకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ రాజారెడ్డి తెలిపారు.గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంట పోషక యాజమాన్యం, నీటి వినియోగం, కీటకాలు, తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు.రాజారెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్‌ఫామ్ పంటకు ప్రతి మూడు నెలలకోసారి ప్రాథమిక పోషకాలతో పాటు ద్వితీయ, సూక్ష్మ పోషకాలను అందించడం వల్ల మొక్కల ఎదుగుదల మెరుగుపడి, దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా బోరాన్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాల లోపాలను గుర్తించి, వాటిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ క్రమంలో ఏరిస్ కంపెనీకి చెందిన మ్యాగ్ మిక్స్, న్యూక్యాలిభోర్, ఏరిఫొటాష్ ఉత్పత్తులను పంట అవసరాలకు అనుగుణంగా, సూచించిన మోతాదుల్లో వినియోగించుకోవాలని తెలిపారు.ఆయిల్‌ఫామ్ తోటల్లో నీటి యాజమాన్యాన్ని సక్రమంగా నిర్వహించడం, పోషకాలను సమతుల్యంగా అందించడం, కీటకాలు, తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు.రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన పెంచుకొని, వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు సాగు పద్ధతులు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రయాణికులకు దాతల చేయూత.. అభినందనీయం!

- స్వర్గీయ సునీల్ జ్ఞాపకార్థం గరిడేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మూడు సిమెంట్ బల్లాల ఏర్పాటు

గరిడేపల్లి (ప్రజానేస్తం జ్వాల):

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలనే సదుద్దేశంతో గరిడేపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో దాతలు మూడు సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేయడం అభినందనీయంగా నిలిచింది. ప్రధాని అమరయ్య, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో చెట్ల నీడన ప్రయాణికులు కూర్చుని విశ్రాంతి తీసుకునేందుకు ఈ బల్లాలను ఏర్పాటు చేశారు.తమ కుమారుడు స్వర్గీయ ప్రధాని సునీల్ జ్ఞాపకార్థం తండ్రి ప్రధాని అమరయ్య, తల్లి సునీత, సోదరుడు అనిల్ అందించిన సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రయాణికులు ఎండలో నిలబడకుండా చెట్ల నీడన కూర్చుని సేదతీరేందుకు ఈ బల్లాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. స్వర్గీయ సునీల్ జ్ఞాపకార్థం చేపట్టిన ఈ సేవా కార్యక్రమం మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోంది. వ్యక్తిగత జ్ఞాపకాన్ని సమాజానికి ఉపయోగపడే సేవగా మలచడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ దాతల కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలే సమాజానికి నిజమైన ఆదర్శం. స్వర్గీయ ప్రధాని సునీల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ బల్లాలు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయి.



ఆదివాసీల హక్కులను కాలరాస్తే సహించేది లేదు!

సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల పనులను అడ్డుకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం: తుడుందెబ్బ

సిర్పూర్ (యు), అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని, ఏజెన్సీ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవద్దని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్ (యు) ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. డోల్ వాయిద్యాలతో భారీ ర్యాలీ చేపట్టారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్ హాజరయ్యారు. పీసా, ఐదో షెడ్యూల్, అటవీ హక్కుల చట్టాలను అమలు చేయాలని, ఆదివాసీలను వేధించడం ఆపాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు, గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, మహిళలు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



40 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక.. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం!

- గురువులకు ఘన సన్మానం.. పాఠశాలకు రూ.10 వేల పోడియం బహూకరణ

గరిడేపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. గడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984--85 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు రామినేని సత్యం, వెంకయ్య, జానీ మియా, వీరారెడ్డి, రమేష్, కృష్ణారెడ్డితో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల విలువైన పోడియంను బహూకరించి తమ గురుభక్తిని, పాఠశాలపై మమకారాన్ని చాటుకున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత మిత్రులు, గురువులు ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.



దసరా మద్యం విక్రయాల టార్గెట్ రూ.1,000 కోట్లు!

బీర్ల కొరత రాకుండా నెల రోజుల ముందే ఎక్సైజ్ శాఖ చర్యలు

హైదరాబాద్ (ప్రజానేస్తం జ్వాల):

దసరా పండుగ సందర్భంగా తెలంగాణలో మద్యం విక్రయాల ద్వారా కనీసం రూ.1,000 కోట్ల ఆదాయం సాధించాలని ఎక్సైజ్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. పండుగ సమయంలో బీర్ల కొరత తలెత్తకుండా, ఉత్పత్తి తగ్గకుండా ప్రభుత్వం నెల రోజుల ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావడంతో ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదని, ఈసారి భారీ ఆదాయం సాధించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఈసారి దసరా మంగళవారం రావడంతో ఆదివారం నుంచే మద్యం విక్రయాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



మఠంపల్లిలో మొబైల్ చోరీల కేసు ఛేదన

అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్.. రూ.80 వేల విలువైన 6 స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం

తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యం.. సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు



హుజూర్‌నగర్, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

మఠంపల్లి ప్రాంతంలో జరిగిన మొబైల్ ఫోన్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి నుంచి సుమారు రూ.80 వేల విలువైన ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు వెల్లడించారు.

తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే టార్గెట్!

తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకొని నిందితుడు చోరీలకు పాల్పడుతున్నట్లు సీఐ వివరించారు. చోరీ కేసు దర్యాప్తులో భాగంగా సిమ్ కార్డులు, కాల్ డేటా వంటి సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు.

రూ.80 వేల విలువైన ఫోన్లు స్వాధీనం

నిందితుడి నుంచి ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చరమంద రాజు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ!

1930కు ఫిర్యాదు చేయండి.. ప్రజలకు డీఎస్పీ వెంకటయ్య సూచన



సూర్యాపేట, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

సైబర్ నేరగాళ్ల మాయమాటలకు మోసపోయి కష్టార్జితాన్ని కోల్పోవద్దని సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ ఏ. వెంకటయ్య సూచించారు. గురువారం సూర్యాపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులకు, కోదాడలో బ్యాంకు అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. APK ఫైళ్లు, లోన్ యాప్‌లు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్, సెక్స్‌టార్షన్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, పిన్, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శివకుమార్ పాల్గొన్నారు.

మల్లారం యువకుడికి న్యాయమూర్తి పదవి!

- నాలుగు రోజుల్లో రెండు విజయాలు.. జూనియర్ సివిల్ జడ్జిగా డేగల సాయి పవన్ ఎంపిక


భీమదేవరపల్లి, అక్టోబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన డేగల సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. తెలంగాణ హైకోర్టు నిర్వహించిన నియామక పరీక్షలో అర్హత సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. న్యాయశాస్త్రంలో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన సాయి పవన్, ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్నారు. నాలుగు రోజుల క్రితమే ఏపీపీ నియామక పరీక్షలోనూ అర్హత సాధించి వరుస విజయాలతో సత్తా చాటారు. ఆయన విజయంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఏఆర్ ఎస్ఐ గోపి మృతి

సిరిసిల్ల(ప్రజానేస్తం జ్వాల):



17వ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గోపి అనారోగ్యంతో కన్నుమూశారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు (సి) గుజిలితండాకు చెందిన ఆయన 2013లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఆర్ ఎస్ఐగా పదోన్నతులు పొందారు.వీఐపీ భద్రత, ఎన్నికల విధుల్లో విశేష సేవలందించిన ఆయన విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపుగా 14 రివార్డులు అందుకున్నారు. ఆయన మృతి పట్ల పోలీసు వర్గాల్లో విషాదం నెలకొంది.